# వుహాన్ శిఖరాగ్ర సమావేశ రాజకీయాలు

**అమెరికా** సామ్రాజ్యవాద నాయకత్వాన వున్న 'అమెరికా – జపాన్, ఆస్ట్రేలియా కూటమి'లో భారత పాలకులు భాగస్వాములయ్యారు. ఆసియా – పసిఫిక్ ప్రాంతంలోని దేశాలు ఈ సముద్రంలో నిరాటంకంగా ప్రయాణించే హక్కులను కాపాడడానికే ఈ కూటమి ఏర్పాటు జరిగిందని ఆసియా ప్రజలకు భరోసా కల్పించడానికి అమెరికా యత్నిస్తోంది. కానీ వాస్తవానికి ఆసియా – పసిఫిక్ ప్రాంతంలో తన ఆధిపత్యం కొరకు వేసిన ఎత్తుగడలో ఒక పనిముట్టు మాత్రమే ఈ కూటమి. ఈ కూటమిలో జేరడం మన దేశానికి ఎంతో ప్రయోజనకరమనీ, ఇది మన దేశం యొక్క హోదాను పెంచుతుందని భారతీయులను నమ్మబలకడానికి భారత పాలకులు ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి అమెరికా సామ్రాజ్యవాదుల ఆధిపత్య రాజకీయాలకు స్నేహహస్తం అందించడంపై ఆసియా మరియు ప్రపంచ ప్రజల కోపాన్ని, వ్యతిరేకతను మనదేశం కూడా పంచుకోవాల్సి వుంటుందనేది వాస్తవం.

ఆసియా–పసిఫిక్ ప్రజలపై తమ ఆధిపత్యాన్ని రుద్దాలనే అమెరికా ఎత్తుగడలకు చైనా ఒక శక్తివంతమైన అడ్డంకిగా నిలిచిందనేది జగమెరిగిన సత్యం. అందువలన ఈ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని తగ్గించడం, దాన్ని ఒంటరిని చేయడం, అవసరమైతే సరైన సందర్భంలో చైనాపై దాడి చేయడానికి సిద్ధంగా వుండడం అనేది ఈ ప్రాంతంలో అమెరికా ఎత్తుగడలో ఒక భాగం. చైనా కూడా తన స్వంత ఎత్తుగడలతో అమెరికాను ఎదుర్కోవడానికి సన్నద్ధమవుతోంది.

భారత చైనాల మధ్యనున్న సమస్యలను, భారతదేశంలో వున్న చైనా వ్యతిరేక భావనలను ఉపయోగించుకొని ఈ ప్రాంతంలో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అమెరికా చేయగలిగినంత చేస్తూ వుంది. చైనాను వ్యతిరేకిస్తున్న, చైనా ప్రభావాన్ని తగ్గించాలని చూస్తున్న భారత పాలకులను సంతృప్తిపరచడానికి అమెరికా ప్రయత్నిస్తున్నది.

భారత పాలకులు అమెరికాతో అంటకాగు తున్నారనీ, అమెరికా అవసరాలను తీర్చడంలో దానితోబాటు చాలా దూరం ప్రయాణించారని చైనాకు బాగా తెలుసు. అయినా తన స్వంత ఎత్తుగడలకనుగుణంగా భారత పాలకులను తమవైపు తిప్పుకోడానికి చేస్తున్న ప్రయత్నాలను చైనా ఆపలేదు. చైనా భారత్‌తో సాధారణ సంబంధాలను నెరుపుతోంది. పరిష్కారంకాని సరిహద్దు సమస్య, డోక్లాం సంఘటన లాంటివి ఉద్రిక్తతలను మరింత పెంచుతాయి. కాబట్టి అలాంటివాటిని అనుమతించకుండా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను దాటవేస్తోంది. ఎలాంటి ఆటంకాలు, ఆంక్షలు లేకుండా చైనా పెట్టుబడులు, వస్తువులు భారతదేశంలోకి ప్రవహిస్తున్నాయి. దౌత్య సంబంధాలు, పరస్పరచర్చలు, సందర్శనలు, నాయకుల సమావేశాలు యివన్నీ యిరువైపుల స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగుతున్నాయి.

2018 ఏప్రిల్ చివరివారంలో భారత ప్రధాని చైనా సందర్శించినపుడు చైనా నగరమైన ఉహాన్‌లో భారత ప్రధాని, చైనా అధ్యక్షుల మధ్య రెండురోజుల శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సమావేశం దౌత్యపరంగా చైనాకు చాలా ముఖ్యమైనది.

2018 ఏప్రిల్ 22న ఇరుదేశాల విదేశాంగ మంత్రులు బీజింగ్‌లో సమావేశమై ఉహాన్ శిఖరాగ్ర సమావేశ సన్నాహాలకు తుది మెరుగులుదిద్దారు. ఈ శిఖరాగ్ర సమావేశ ప్రాముఖ్యతను తెలియజేస్తూ చైనా విదేశాంగమంత్రి వాంగ్–యి యిలా అన్నారు: "ఉభయదేశాల నాయకులు ప్రపంచ పరిస్థితులపై, భారత, చైనా అభివృద్ధిపై కీలక నిర్ణయాలు చేస్తారు. వారు సాధారణమార్గాన్ని నిర్దేశిస్తారు. కొత్త లక్ష్యాలను గుర్తిస్తారు. చైనా – ఇండియా సంబంధాల మెరుగుదలకు కొత్త ఊపునిస్తారు."

"దక్షిణాసియాలో, హిందూ మహాసముద్రంలో, ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా, భారత్‌లకు విడదీయలేని ప్రయోజనాలున్నాయి. అందువలన పరస్పర చర్చల ద్వారా ప్రపంచ పరిస్థితులపై యిరుదేశాలు ఒక అభిప్రాయానికి రావలసిన తక్షణ ఆవశ్యకత వుంది." చైనా విదేశాంగమంత్రిత్వశాఖ ప్రతినిధి దీనిని మరింత వివరించారు. "బహుధ్రువ ప్రపంచాన్ని రూపొందించడంలో, ఆర్థిక సరళీకరణలో అలాగే శాంతి, స్థిరత్వం, అభివృద్ధిలను దృఢపరచుటలో ఇండియా, చైనాలు ప్రధానశక్తులు." ........ "నూతనంగా ఆవిర్భవిస్తున్న మార్కెట్లు, అత్యధిక జనాభా కల్గిన అభివృద్ధి చెందుతున్న దేశాలుగా.... అందరినీ కలుపుకెళ్ళడానికిగాను ప్రపంచీకరణను ఈ రెండు దేశాలు ముందుకు తీసుకెళ్తాయని విశ్వసిస్తున్నాము." భారత ప్రధాని నరేంద్రమోడీ, చైనా అధ్యక్షులు జి చిన్ పింగ్‌లు ఉహాన్‌లో సాంప్రదాయాలను, ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి అధికార్లు, సమావేశ వివరాలను వ్రాసేవారు కూడా లేకుండా కేవలం అనువాదకులతో ఇష్టాగోష్టి సమావేశం జరుగుతుందనీ, అలాగే నిర్దిష్ట అజెండా, సంయుక్త ప్రకటన కూడా వుండవని యిరుదేశాల విదేశాంగ మంత్రులు తెలిపారు.

అన్నట్లుగానే సుందరమైన వుహాన్ నగరంలోని ఉచింగ్ తూర్పు సరస్సులో గల అతిధి గృహంలో యిరుదేశాల నాయకులు కలుసుకున్నారు. బోటులో విహరించారు. తోటల్లో నడిచారు. 'మనసువిప్పి' మాట్లాడుకున్నారు.

మొదటి రౌండు సమావేశాల ముగింపులో మోడీ, చైనా అధ్యక్షుడిని ఇలాంటి సాంప్రదాయేతర సమావేశం కొరకు భారతదేశానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షులు "ప్రపంచ ఆర్థిక వృద్ధికి చైనా, భారత్‌లు రెండు ప్రధాన ఇంజన్లు. బహుధ్రువ ప్రపంచానికి, ప్రపంచీకరణ చెందుతున్న ఈ ప్రపంచానికి మనం కేంద్ర స్థంభాలం. ప్రపంచంలో శాంతి, సుస్థిరతలు వర్ధిల్లడానికి భారత్ చైనా మంచి సంబంధాలు ఒక ముఖ్యమైన అనుకూల కారకంగా పనిచేస్తాయి." అన్నారు.

ఉహాన్ ఇష్టాగోష్టి సమావేశం ఏం సూచిస్తుంది? అది తెలియాలంటే ముందుగా మనం ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితిని అవగాహన చేసుకోవాల్సి వుంది.

అమెరికా సామ్రాజ్యవాదం దురాక్రమణ యుద్ధాల (ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్) ద్వారా దూకుడుగా అమలుచేస్తున్న ప్రపంచ ఆధిపత్య విధానాలు, గ్లోబలైజేషన్ పేర అనుసరిస్తున్న విధానాలు, తీవ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రపంచ పోరాటాలు తీవ్రంగా వెనుకపట్టు బట్టాయి. ఈ విధానాలను వ్యతిరేకిస్తున్నవారినుండి, వీటి బారినపడి ప్రతిఘటిస్తున్న వారినుండే గాక ప్రపంచవ్యాప్తంగా ప్రజల నుండి శక్తివంతమైన నిరసనోద్యమాలు వెల్లువెత్తాయి. ఈ విధానాలు మొత్తంగా పెట్టుబడిదారీ ప్రపంచాన్ని, ప్రత్యేకంగా అమెరికాను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి దించాయి. అవి సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలను కూడా మరింత పెంచాయి. ఇతర సామ్రాజ్యవాదులు మరింత చైతన్యంగా వ్యవహరిస్తూ దోపిడీలో, ఆధిపత్యంలో తమ వాటాను డిమాండ్ చేస్తున్నారు. సోవియట్ యూనియన్ పతనం తర్వాత వెనుకపట్టు బట్టిన రష్యా కూడా తిరిగి తెప్పరిల్లుకొని వెనుకటి స్థాయి దిశగా పయనిస్తోంది. తన మిత్రులకు అండగా, తన ప్రభావ ప్రాంతాలను కాపాడుకుంటూ, అమెరికా ప్రపంచ ఆధిపత్య విధానాలను సవాలు చేస్తోంది. చైనా తన శక్తులన్నిటినీ కేంద్రీకరించి శక్తివంతమైన ఆర్థిక, రాజకీయ, సైనిక శక్తిగా ఉద్భవిస్తోంది. ఆసియాలో అమెరికాకు బలమైన శత్రువుగా ఎదిగింది. అది బహిరంగంగా మరియు ఎస్‌సిఒ లాంటి కూటములు, రష్యా మరియు ఇతర ఒకే ఆలోచనా విధానం గల దేశాలతో కలిసి ప్రపంచంపై ఆధిపత్యాన్ని సాగించాలనుకుంటున్న అమెరికాకు సవాలుగా నిలుస్తోంది. అమెరికా ప్రపంచాధిపత్యం కోసం పట్టు విడవకుండా తనవంతుగా కృషి చేస్తోంది. అదే సందర్భంలో ప్రస్తుతం వున్న పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటే అమెరికా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో, పీడిత ప్రజల నుండి పెరుగుతున్న వ్యతిరేకత, తన శత్రువుల మధ్యలోనే గాక స్నేహితుల మధ్యలో కూడా ఒంటరిదవడం లాంటి పరిస్థితులనెదుర్కొంటుంది. ప్రపంచంపై ఆధిపత్యాన్ని సాధించే ప్రయత్నంలో ఈనాడు అమెరికా ఎన్నో ఆటంకాలను, సవాళ్ళను, వ్యతిరేకతలను ఎదుర్కొంటోంది. ఈ అంతర్జాతీయ పరిస్థితిని, వివిధ దేశాలపై, ప్రజలపై తాను సాధిస్తున్న ప్రభావాన్ని అంచనా వేసుకున్న నేపథ్యంలోనే చైనా ఈ దౌత్యనీతిని, ఎత్తులను ప్రదర్శిస్తోంది.

వుహాన్ శిఖరాగ్ర సమావేశ దౌత్యం ద్వారా చైనా నాయకులు భారత పాలకులకు సాధ్యమైనంత గట్టిగా ప్రభావవంతంగా ఒక సందేశమివ్వాలని నిర్ణయించుకున్నారు. ఆ సందేశం : 'అమెరికా ఖచ్చితంగా ఆధారపడదగినది కాదు. భారతదేశంతో సంబంధాలలో అమెరికా, ఆ మాటకొస్తే ఏ దేశంతో సంబంధాలు నెరిపినా అమెరికాను నడిపించేది తన స్వప్రయోజనాలే తప్ప మరొకటి కాదు. ప్రపంచం మొత్తంపై తన ఆధిపత్యాన్ని స్థాపించుకోవాలనే ఏకైక లక్ష్యం కోసం మాత్రమే భారతదేశంతోసహా ఇతర దేశాలతో ప్రతిసంబంధాన్ని, వనరులను, మైత్రిని వాడుకుంటుంది. అమెరికా ఆధిపత్యం ఆసియాకు వినాశనకరం. అది ఈ ప్రాంతమంతటినీ విధ్వంసకర యుద్ధంలోకి లాగుతుంది. కాబట్టి అమెరికాపై ఆధారపడినా, అమెరికా ప్రపంచాధిపత్య ఎత్తుగడల రథచక్రాలను భారతదేశం తమకు తాము కట్టివేసుకున్నా, భారత పాలకులు తమ ఊహకందని ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడమే అవుతుంది. చైనా మరియు ఇతరదేశాలు ప్రయత్నిస్తున్న బహుళధ్రువ ప్రపంచం భారత పాలకులకు కూడా సురక్షితం మరియు మెరుగైనది'. ఈ సందర్భంలో భారత నాయకులకు వీనులవిందు కలిగించే మాటలను ఉపయోగించడం ద్వారా వారు అమెరికా ప్రపంచాధిపత్య ఎత్తుగడల నుండి విడగొట్టుకొని బహుళధ్రువ ప్రపంచాన్ని రూపొందించడానికి చైనాతో జతకట్టి సహకరించాల్సిందిగా పిలుపునిచ్చారు.

దళారీ స్వభావం గల భారత పాలకవర్గాలు భారతదేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సైనికంగా సామ్రాజ్యవాదానికి లోబడి వుండే విధంగా తీసుకెళ్ళాయి. అదే సందర్భంలో భిన్న సామ్రాజ్య వాదులు భారతదేశంలో పోటీపడుతున్నారు. భారత పాలకవర్గాలు ఇంకా నిర్దిష్ట సామ్రాజ్యవాదానికి మాత్రమే మద్దతు తెలిపేవిధంగా ఐక్యంకాలేదు. ఈ పరిస్థితి భారత పాలకవర్గాలలో, వాటి పార్టీలలో, వాటి పరిపాలనలో ప్రతిబింబిస్తుంది. కాబట్టి మొత్తం మీద సామ్రాజ్యవాదానికి లోబడి వుండే నిర్మాణంలో వుంటూనే సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు, కుమ్మక్కులు ఆధారంగా ఒక్కొక్క సమయంలో ఒక్కో సామ్రాజ్యవాది వైపు మొగ్గుచూపటం జరుగుతోంది. భారతదేశం లాంటి దేశాల పాలకవర్గాలపై అంతర్జాతీయ రంగంలో సామ్రాజ్యవాదుల స్థితిగతుల్లో వచ్చే మార్పులు, వాటి సంక్షోభాలు కూడా ప్రభావం చూపుతుంటాయి.

భారతదేశ ప్రయోజనం మరియు ప్రజల డిమాండ్ ఏమిటంటే ఈ సామ్రాజ్యవాదం కాకుంటే ఇంకో సామ్రాజ్యవాద దేశం వైపు మొగ్గుచూపడం కాదు. అలాగే ఏకధ్రువ ప్రపంచాన్నో, బహుళధ్రువ ప్రపంచాన్నో ఎంచుకోవడం కాదు. మన అవసరం ఏమిటంటే సామ్రాజ్యవాదాన్ని శాశ్వతంగా పాతిపెట్టాలి. దోపిడీ, పీడన, యుద్ధాలు ఆధిపత్యం లేని ప్రపంచాన్ని సాధించాలి. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని, తన ప్రజలపై నమ్మకముంచలేని ఏ దేశమైనా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడలేదు. ఆధిపత్య రాజకీయాలనెదుర్కొనలేదు. తన ప్రజల ప్రయోజనాల కోసం సామ్రాజ్యవాదుల మధ్యనున్న వైరుధ్యాలను, వాటి సంక్షోభాలను ఉపయోగించుకొని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్ళలేదు. భారత ప్రజలు నేడు ఎదుర్కొంటున్న సమస్య ఏమిటంటే భూస్వామ్య విధాన సంకెళ్ళతో, సామ్రాజ్యవాదానికి లోబడిన కట్టుబాట్లతో ప్రజలు కుదేలవుతున్నారు. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా మరియు నూతన ప్రజాతంత్ర భారతదేశం కొరకు ఉద్యమాలను తీవ్రతరం చేయడమే ఈనాటి ఆవశ్యకత. అమెరికా సామ్రాజ్యవాదం ఇతరదేశాల మీద, ఆసియా ప్రజలమీద, ఆసియా పసిఫిక్ ప్రాంతం మీద తన ఆధిపత్యాన్ని రుద్దాలనుకుంటోంది. అలాంటి అమెరికా చేతిలో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల కూటమి అనేది పై లక్ష్యాన్ని నెరవేర్చు కోడానికి ఒక పనిముట్టు మాత్రమే. అందుకే ఈ కూటమి నుండి భారతదేశం బయటకు రావాలని మన ప్రజానీకం డిమాండు చేయాలి. సామ్రాజ్యవాద దోపిడీ, ఆధిపత్యాల నుండి బయటకు వచ్చి స్వతంత్ర, ప్రజాతంత్ర, మరియు శాంతియుత ఆసియా కొరకు పోరాడుతున్న ప్రజలకు బాసటగా తప్పక నిలవాలి.

oooo